క్లుప్తంగా

నేడు విద్యుత్ కోత

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని విజయ బ్యాంక్ సెంటర్ నుంచి కళ్యాణి హోటల్, సుబ్బయ్యతోట, షాదీఖానా ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చర్చి నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



యడ్లపాడు: సంగంగోపాలపురం గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న జీవాధిపతి ప్రార్థన మందిరానికి ఎంఆర్ ఫౌండేషన్ అధినేత మల్లెల రాజేష్‌నాయుడు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈనెల 21న చర్చి ప్రారంభోత్సవానికి సంఘస్తులు సన్నాహాలు చేస్తున్నారు. ఆ రోజు భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నందున దానితోపాటు చర్చి నిర్మాణానికి సహకరించాలని రాజేష్‌నాయుడిని చర్చి కమిటీ పెద్దలు కోరగా ఆయన వెంటనే స్పందించి విరాళంగా చెక్కును అందించారు.

రైతు భరోసాకు 30లోగా దరఖాస్తు చేసుకోవాలి

శావల్యాపురం: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబధించి రైతుభరోసా పథకం సాయం కోసం ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని మండల వ్యవసాయ అధికారి (ఏవో) రామినేని రామారావు ఆదివారం తెలిపారు. ఏవో మాట్లాడుతూ కొత్తగా పొలాలు కొనుగోలు చేసిన వారు, వారసత్వంగా పొలాలు రిజిస్టర్ చేసుకున్నవారు, ఇప్పటి వరకు రైతుభరోసా వర్తించని వారు ఈనెల 30లోగా ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా నంబరు జిరాక్స్‌లతో సమీపంలోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

పేద బ్రాహ్మణులకు నిత్యావసరాలు



వినుకొండ(నూజెండ్ల) : స్థానిక జీవీ మాధవరావు కార్యాలయంలో బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని 8 మంది పేద బ్రాహ్మణులకు బియ్యం, నూతన వస్త్రాలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనంతరం సుదీర్ఘ కాలం నుంచి సహాయసహకారాలు అందిస్తున్న అన్నాప్రగడ వెంకటేశ్వర రావును మెమెంటో, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి నాయకులు, దాతలు పాల్గొన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



వినుకొండ టౌన్: అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం పట్టణంలోని పున్నమి టవర్స్‌లో అగ్నిమాపక శాఖ అధికారులు మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. వంట చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్ సిలిండర్ లీకేజి, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ తదితర అంశాలను ప్రదర్శనాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఐసీఎస్ఎఫ్ శ్రీనివాసరావు, డీఓపీ రమణారెడ్డి, ఎల్ఎఫ్ ప్రకాష్‌రావు, వెంకటేశ్వర్లు, ఎఫ్ఎంలు కేశవ బాబు, ప్రభాకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, మస్తాన్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేడు అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు విడుదల

శావల్యాపురం: సాగర్ జలాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్పీ డీఈ చాట్రగడ్డ రామారావు ఆదివారం చెప్పారు. డీఈ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ఆరుతడి పంటలు కాపాడుకునేందుకు ఆరు టీఎంసీలు విడుదల చేస్తున్నట్టు వివరించారు. గంటావారిపాలెం గ్రామ సమీపాన ఉన్న అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు 1,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు వివరించారు. తాగునీటి అవసరాలతో పాటు ఆరుతడి పంటల సంరక్షణ కోసం సాగర్ జలాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ఉండటానికి ఆయా గ్రామాల పరిధిలోని మంచినీటి చెరువులు, వాగులు, కుంటలు నింపుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వారం రోజులు మాత్రమే సాగర్ జలాలు విడుదల చేస్తామని పేర్కొన్నారు. రామారావుతో పాటు ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఫలప్రదాయ.. ప్రసన్నాంజనేయ

వైభవంగా తిరునాళ్ల ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

బొప్పూడి డొంకలోని ప్రసన్నాంజనేయస్వామి 40వ తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్వామికి తెల్లవారు జామున సుప్రభాతసేవ, వివిధ ఫలాలతో విశేష అలంకరణ, సిందూరార్చన, సహస్రనామపూజ అర్చకులు నిర్వహించారు. హనుమత్ లక్ష్మణ సమేత సీతారామస్వామి శాంతి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిపించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ములుకుట్ల విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రసంగం, పౌరాణిక ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. – చిలకలూరిపేట:



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ధర్మమార్గంతోనే మోక్ష సిద్ధి



ప్రసంగిస్తున్న బ్రదర్ షఫీ



కార్యక్రమానికి హాజరైన ముస్లింలు

- ప్రముఖ మాస్టర్ మోటివేటివ్ బ్రదర్ షఫీ
- చిలకలూరిపేటలో ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు
- షఫీని కలిసి ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

చిలకలూరిపేటటౌన్: ధర్మ మార్గంతోనే మోక్ష సిద్ధి సాధ్యమని ప్రముఖ మాస్టర్ మోటిఫికేషన్ బ్రదర్ షఫి చెప్పారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో ఉన్న గోల్కొండ గార్డెన్‌లో ఫౌండేషన్ చైర్మన్ షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రదర్ షఫీ పాల్గొన్నారు. అనంతరం షఫీ మాట్లాడుతూ సర్వ మానవ సమానత్వం గురించి వివరించారు. కుటుంబ వ్యవస్థ, స్త్రీ, పురుషులు అనుసరించాల్సిన జీవన విధానాల గురించి చెప్పారు. చివరిగా వేలమందికి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన మస్తాన్‌ను అభినందించారు. ముందుగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కార్యక్రమ నిర్వాహకుడు ఆరా మస్తాన్‌ను, మోటివేటర్ షఫిని కలిశారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్యాస్ వలన ఏర్పడిన మంటలను ఆర్పే విధానం ప్రదర్శిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

చిలకలూరిపేట: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎస్.భాస్కరబాబు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా టిడ్కో గృహ సముదాయంలో గ్యాస్, విద్యుత్ వలన అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళనకు గురి కాకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్యాస్ లీకైనప్పుడు మంటలను ఆర్పే విధానాన్ని ప్రదర్శించి చూపారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ ఎస్ వెంకయ్య, సిబ్బంది కె శివనాగేశ్వరరావు, పీవీ సుబ్బారావు, కె.ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

సుబ్బయ్యపాలెంలో అగ్నిప్రమాదం

సుబాబుల్ తోట దగ్ధం

రొంపిచర్ల: సుబ్బయ్యపాలెంలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. ఆ గ్రామ పరిధిలోని హైవే రోడ్డు పక్కన ఉన్న గాడిపర్తి సీతయ్యకు చెందిన సుబాబుల్ తోట నుంచి ప్రమాదవశాత్తు పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. అక్కడ ఉన్న రైతులు మంటలు ఆర్పేందుకు తీవ్రంగా యత్నించారు. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ప్రమాదంలో సీతయ్య పొలంలో సాగు చేస్తున్న ఎకరంన్నర సుబాబుల్ తోట దగ్ధమైంది. రూ. లక్ష రూపాయల మేర నష్టం సంభవించింది.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏపీఆర్జేసీ, పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ సెంటర్

వినుకొండ(నూజెండ్ల) : యూటీఎఫ్ వినుకొండ ప్రాంతీయ శాఖ కార్యాలయంలో ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ హెల్ప్ లైన్ సెంటర్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను వినుకొండ సీనియర్ నాయకులు అప్పరాజు నాగేశ్వరరావు ప్రారంభించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులకు మార్గదర్శనం చేసేందుకు ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఇ. వెంకటరెడ్డి, జి.సాంబశివరావు జి.నాగేంద్రుడు, పీఏ జిలానీ తదితరులు పాల్గొన్నారు.



సెంటర్‌ను ప్రారంభిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వైభవంగా నీలంపాటి అమ్మవారి తిరునాళ్ల

గోలి(రెంటచింతల): మండలంలోని గోలి గ్రామ శివార్లోని అతి పురాతనమైన నాగేంద్రస్వామి వారి దేవస్థానంలో వెలసిన నీలంపాటి అమ్మవారి ఆలయ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు అప్పయ్యస్వామి, రామరాజు కేశవరావు నేతృత్వంలో వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనేక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకుని అమ్మవారికి పొంగళ్లను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంటిరెడ్డి నర్సిరెడ్డి స్వామివార్ల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులకు మహాన్నదానం చేశారు. తిరునాళ్ల సందర్భంగా గోలి, జెట్టిపాలెం, పశర్లపాడు, రెంటచింతల గ్రామాలకు చెందిన భక్తులు కుంకుమబండ్లు కట్టి గ్రామంలో మేళ తాళాలతో బాణసంచా కాలుస్తూ గ్రామోత్సం నిర్వహించి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ ఆవరణలో నున్న రాతి, జీవ ధ్వజస్తంభాలు వద్ద భక్తులు చేపట్టిన ప్రత్యేక పూజలతో ఆ ప్రాంతమంతా భక్తి భావం వెల్లివిరిసింది. ఆలయ ప్రధాన ధర్మకర్త బత్తినేటి బాల కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు కొండా రామయ్య, ఆవుల వెంకటరెడ్డి, చట్టా శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గోలి గ్రామ శివార్లో పూజలు అందుకుంటున్న నీలంపాటి అమ్మవారు

షిరిడి సాయి మందిరంలో వార్షికోత్సవం



యడ్లపాడు: సందెపూడి గ్రామంలోని శ్రీషిరిడి సాయి బాబా మందిరంలో 11వ వార్షిక వేడుకలు జరిగాయి. ఆలయంలో సాయి నాథునికి అభిషేకాలు, విశేష అలంకరణ, హోమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వార్షికోత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

నవోదయ మోడల్ టెస్ట్



వినుకొండ(నూజెండ్ల) : స్థానిక గీతమ్స్ హైస్కూల్‌లో నవోదయ మోడల్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గం నుంచి 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష అనంతరం ఎక్కువ మార్కులు సాధించడానికి తీసుకోవాల్సిన మెలకువలను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలం

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు సోమవారం వేలం నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్ర బాబు ఆదివారం తెలిపారు. సారా, తెలంగాణ మద్యంను తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడు వందనం మృతి

నాదెండ్ల: సాతులూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోటా వందనం (80) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన సాతులూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేసి రిటైరయ్యారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు ఒంగోలు ప్రభుత్వాస్పత్రిలో వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. వందనం మృతి పట్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

ఇంటర్, డిగ్రీలో చేరేందుకు దరఖాస్తు చేయండి

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో ఇంటర్, డిగ్రీలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. మొదటి ఏడాది డిగ్రీ దరఖాస్తులు ఆన్‌లైన్ చేసుకోవాలని, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు కళాశాలలో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు.

నాటక రంగ దినోత్సవం



నరసరావుపేట ఈస్ట్: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకొని ఆదివారం నరసరావుపేట రంగస్థలి, నరసరావుపేట కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు కళాకారులు మాట్లాడుతూ, ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి సాంఘిక నవల, నాటకం రాజశేఖర చరిత్ర రాసిన నాటకకర్త, దర్శకుడు, ప్రదర్శనకారుడు వీరేశలింగం అని కొనియాడారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు షేక్.బాజీ, పొన్నపాటి ఈశ్వరరెడ్డి, ఎస్.అయ్యపరాజు, ఎ.ఎ.మధుకుమార్, కె.ఆర్.ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రిసార్ట్‌తో ఆహ్లాదం

ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: జిల్లా కేంద్రంలో తొలిసారిగా గేమ్ జోన్స్‌తో కూడిన రిసార్ట్స్ ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. వినుకొండరోడ్డులో తాళ్ల వెంకటకోటిరెడ్డి, సుదర్శనరెడ్డి నిర్మించిన స్కైవాలి రిసార్ట్స్‌ను ఆదివారం ఎమ్మెల్యే గోపిరెడ్డితోపాటు పలువురు ప్రముఖులు ముఖ్యఅతిథులుగా హాజరై గేమ్‌జోన్స్, లగ్జరీ రూములు, ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభించారు. రిసార్ట్స్‌లోని వివిధ విభాగాలను పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ఆరంభించారు. అనంతరం ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ స్కై వ్యాలీ రిసార్ట్స్‌లోని వసతులు మెట్రోపాలిటన్ సిటీలను తలపిస్తున్నాయని నిర్వాహకులను అభినందించారు. రిసార్ట్స్‌లో ఏర్పాటుచేసిన గేమింగ్ జోన్‌ని సందర్శించారు. కార్యక్రమంలో పాడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.ఎ.హనీఫ్, ప్రముఖ డాక్యుమెంట్ రైటర్ సింగం యోగాంజనేయశర్మ, గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజా వలి, మున్సిపల్ లైసెన్స్‌డు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మసాని కమలాకరరెడ్డి, కాంట్రాక్టర్ ఇప్పల దానారెడ్డి, చల్లా నారపరెడ్డి, కేపీ రంగారావు పాల్గొన్నారు.



రిసార్ట్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

బరంపేటలో కొత్త షాదీఖానా నిర్మిస్తాం

- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- ఇస్లాంపేట మర్కస్ మసీదు అభివృద్ధికి రూ.2 లక్షలు అందజేత

నరసరావుపేట: పట్టణంలోని బరంపేటలో మరో షాదీఖానా నిర్మిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. రంజాన్ పర్వదినాలను పురస్కరించుకొని మతపెద్దల ఆహ్వానం మేరకు ఆదివారం సాయంత్రం ఇస్లాంపేటలోని మర్కస్ ఈ మసీదును ఎమ్మెల్యే సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును వడ్డించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేష కృషిచేస్తోందన్నారు. మసీదు అభివృద్ధికి తన వంతుగా రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే ప్రకటించారు. వెంటనే రూ.2లక్షలను మసీదు పెద్దలకు అందజేశారు. బరంపేటకు చెందిన ముస్లిం సోదరులు శుభకార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రకాష్‌నగర్‌లోని షాదీఖానా దూరమైందని చెబుతున్నారని, అందువల్ల ఆ ప్రాంతంలో మరో షాదీఖానా ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనికోసం ప్రభుత్వం నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించి త్వరలో శంకుస్థాపన చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, పట్టణ మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ మహబూబుబాషా, వార్డు నాయకులు షేక్ కరిముల్లా, షేక్ ఖాజా, మతపెద్దలు పాల్గొన్నారు.



మసీదు అభివృద్ధికి రూ.2లక్షలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



సంతగుడిపాడులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



సంతగుడిపాడులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

రొంపిచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. గృహాలకు జగనన్న స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ప్రజలు నాయకులకు ఘన స్వాగతం పలికారు. జయహో జగనన్న అంటూ నినదించారు. అచ్చయ్యపాలెం, సంతగుడిపాడు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సర్పంచ్ మందలపు వీరరాఘవమ్మ, వీరరాఘవయ్య, వట్టికొండ సుందరయ్య, గాడిపర్తి లక్ష్మయ్య, తిరపాటి అంజనారెడ్డి, కాటా రామిరెడ్డి, పల్లకి శ్రీనివాసరెడ్డి, చింతగుంట అంజిరెడ్డి, ఇరికేపల్లి సుబ్బారెడ్డి, వట్టిజొన్నల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మద్దిరాలమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో మద్దిరాలమ్మ

పిడుగురాళ్లరూరల్: కోరికలు తీర్చే బంగారు తల్లి మద్దిరాలమ్మ తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న మద్దిరాలమ్మ దేవాలయంలో ఆదివారం తిరునాళ్లను నిర్వహించారు. దీనిలో భాగంగా తెల్లవారుజాము నుంచే అమ్మవారికి కుంకుమ పూజలు, క్షీరాభిషేకం, గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచరణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించి భక్తుల దర్శనార్థం ఉంచారు. ఈ తిరునాళ్లకు విచ్చేసిన గ్రామస్తులు దేవాలయానికి చేరుకొని పొంగళ్లు, ముడుపులు చెల్లించారు. తిరునాళ్ల చూసేందుకు వచ్చిన చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాదినబోయిన వెంకటేశ్వర్లు, ఓబులయ్య, లక్ష్మయ్య, నాగయ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా స్వామివారి శాంతి కల్యాణం

రెంటచింతల: రెంటచింతలలోని బ్రహ్మయ్య బావి సెంటర్లో వేంచేసి ఉన్న విఘ్నేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి, షిరిడి సాయిబాబా, వెంకటేశ్వర స్వామి, నాభిశిల వార్ల మందిరం 12వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఘండికోట విజయమోహన్ కుమార్ శర్మ నేతృత్వంలో పలువురు అర్చకులు ఉదయం 7గం.లకు నాభిశిలకు వేదస్వస్తి, ఉదయం 8గంటలకు విఘ్నేశ్వరస్వామి, షిర్డిసాయిబాబా, వెంకటేశ్వరస్వామి వార్లకు పంచామృత అభిషేకాలు, అభయాంజనేయ స్వామి వారికి సహస్రనామార్చన, ఉదయం 10 గంటలకు సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి వార్ల శాంతి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మందిరంలో వేంచేసిన స్వామివార్లకు వందలాదిమంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వార్షికోత్సవాల్లో పాల్గొన్న వేలాదిమంది భక్తులకు అన్నదానం చేపట్టారు. మందిరాన్ని వివిధ రకాల పూలతో, రంగురంగుల విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు.



ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చిన స్వామివార్లు